## బాలయ్యబాడలో ఇండ్లను కూల్చివేయొద్దు : ఎమ్మెల్యే రాజాసింగ్

**- విషయంపై సిఎం రేవంత్‌రెడ్డికి కలిసి విన్నవిస్తా**

**బేగంబజార్, నవంబర్ 4 ప్రభాతవార్త:** గోషామహల్ పోలీస్ గ్రౌండ్ అనుకుని ఉన్న బాలయ్య బాడలోనివాసం ఉంటున్న ఇండ్లను తొలగించే ముందు వారికి, గోషామహల్‌లోనే ప్రత్యామ్నాయ యోచనచేయాలని గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ అన్నారు. మంగళవారం గోషామహల్ సర్కిల్ 14 డిప్యూటి మున్సిపల్ కమీషనర్ ఉమా ప్రకాష్, స్థానిక బిజెపి నాయకులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో నూతనంగా నిర్మించున్న ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణం కోసం 60పైకిగా ఇండ్లను యాజమానులకు జిహెచ్ఎంసి అధికారులు నోటిసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో స్థానికుల అభ్యర్థన మేరకు పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు తమ ఇండ్లను కూల్చకుండా చొరవచూపాలని విన్నవించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 80 ఏండ్లు ఇక్కడ నివసిస్తున్న బస్తీవాసులను ఇండ్లను



స్థానిక ప్రజలను అడిగి వివరాలు తెలుసు కుంటున్న దృశ్యం

కూల్చకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని కనుగొనాలని డిసి ఉమాప్రకాష్‌కు సూచించారు. ఇక్కడ నివసిస్తున్న కుటుంబాలను రక్షించేందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి బస్తీ వాసులను సమస్యలను వివరిస్తామ న్నారు. ఈకార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ వార్త

# అయ్యా..అభ్యర్థులెవరు ఇక్కడ.!

**- ప్రచారంలో పార్టీ అధినాయకులు- అభ్యర్థులంతా ప్రచార బొమ్మలేనా..! - జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో వైవిధ్య పరిస్థితి**

**జూబ్లీహిల్స్, నవంబరు 4, ప్రభాతవార్త:**

**కాంగ్రెస్ నుంచి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి కేటీఆర్, బీజేపీ నుంచి కిషన్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభ్యర్థుల కంటే ప్రత్యక్షంగా వీరే కనిపిస్తున్నారు.. ప్రచారంలో, ప్రజల్లో అలుపెరగకుండా తిరుగుతున్నారు.. ప్రచార తెరపై పోటీపడుతున్నారు.. అందుకే ఇక్కడ అభ్యర్థుల కంటే ఇప్పుడు ఈ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో వీరి పేర్లే వినిపిస్తున్నాయి.. వీరి చిత్రాలే దర్శనమిస్తున్నాయి.. ఉన్న అభ్యర్థులు కాస్త ప్రచార బొమ్మలుగా మారారు. అధినేతలు ప్రచారంలో అంతా తామై ముందుకుసాగుతున్నారు. ముగ్గురు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రచారంలో తలమునకలయ్యారు.**





### వైవిధ్యం.. అంతుర్యుద్ధం

మునుగోడు, హుజూరాబాద్, కంటోన్మెంట్.. ఈ నియోజకవర్గాల్లో జరిగిన ఉప ఎన్నికలు వేరు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు వేరు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రతిష్టాత్మకంగా మారింది. సీఎం నివసించే జూబ్లీహిల్స్ ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉన్నప్పటికి ఈ విషయం రాష్ట్రంలోని చాలా మందికి తెలియదు. జూబ్లీహిల్స్ కాస్త జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే ఉంటుందనే ఆలోచనలో ఉన్నారు. దీనికితోడు జూబ్లీహిల్స్ స్థానాన్ని దక్కించుకొని కాంగ్రెస్ ఖాతాలో మరో సీటు వేసుకోవాలని సీఎం భావిస్తున్నారు. తద్వారా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయాలని భావిస్తున్నారు. దీనికితోడు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యదవ్ విషయంలోనూ ముఖ్యమంత్రి ఢిల్లీ పెద్దల వద్ద పట్టుబట్టి మరి ప్రకటించుకున్నారు. దీంతో గెలుపు బాధ్యతలను తన భుజాలపై వేసుకున్నారు. ఒక వేళ గెలుపు దక్కక పోతే జూబ్లీహిల్స్ తమ స్థానం కాదని వాదించే అవకాశాలున్నప్పటికి రాజకీయంగా ముఖ్యమమంత్రికి ఇరకాటంగా మారే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అక్టోబరు 31న వెంగళ్‌రావు నగర్, సోమాజీగూడ, నవంబరు 1న బోరబండ, ఎర్రగడ్డ, 4న షేక్‌పేట-1, రహమత్‌నగర్, 5న షేక్‌పేట-2, యూసుఫ్‌గూడ, 8న ఆరు డివిజన్లలో వాహన ర్యాలీ, 9న షేక్‌పేటలో వాహన ర్యాలీలో ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కన్నా ఎక్కువగా ప్రజలకు తన వాదనలన, వాణిని రేవంత్‌రెడ్డి వినిపిస్తున్నారు. ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ కోరుతున్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు ఎంతో అవసరం. నగరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తన సత్తా చాటింది. అయితే కంటోన్మెంట్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ స్థానాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకొంది. దీంతో జూబ్లీహిల్స్ స్థానాన్ని కోల్పోకుండా ఎలాగైనా దక్కించుకోవాలని బీఆర్ఎస్ భావిస్తుంది. ఈ క్రమంలోనే నియోజకవర్గంలో బీఆర్ఎస్ తన ప్రచార వేగాన్ని పెంచింది. ఇందులో భాగంగానే కేటీఆర్ అక్టోబరు 31న షేక్‌పేట, నవంబరు 1న రహమత్‌నగర్, 2న యూసుఫ్‌గూడ, 3న బోరబండ, 4న సోమాజీగూడ, 5న వెంగళ్‌రావునగర్, 6న ఎర్రగడ్డ, 8న షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, 9న షేక్‌పేట నుంచి బోరబండ వరకు బైక్ ర్యాలీని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమాలన్నింటిలో కేటీఆర్ ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా అభ్యర్థి తరుపున అవసరమైన ప్రచారాన్ని తానే నిర్వహిస్తున్నారు. ఇది కారుకు, బుల్డోజరుకు మధ్య జరుగుతున్న యుద్ధమని ఆయన పదేపదే స్పష్ట చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు ద్వారా తమ సత్తాను చాటడమే కాకుండా రాష్ట్ర స్థాయిలో పార్టీకి ఉత్తేజం తీసుకురావాలని ఆయన భావిస్తున్నారు. దీంతో ఎన్నికల్లో అంతా తానై ముందుకు సాగుతున్నారు. ఇక బీజేపీ పరిస్థితి వేరు. అభ్యర్థి విషయంలో నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తల్లో కొంత అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తుంది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లు సైతం ఇక్కడ రావంటూ పార్టీ నేతలే బహిర్గతంగా మాట్లాడుతున్నారు. ఈ క్రమంలోనే కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి కాస్త జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కీలకంగా మారారు. ఆయన పార్లమెంటు నియోజకవర్గంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉండటంతో ఇక్కడ గెలుపు బాధ్యతలను తానే తీసుకున్నారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షాలు సైతం అభ్యర్థి విషయంలో బీజేపీని లక్ష్యంగా చేసుకొని వ్యాక్యలు చేస్తుండటం, కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయంలో కిషన్‌రెడ్డికి సవాల్ విసిరినా సమాధానం ఇవ్వకపోవడంతో పార్టీ వర్గాల్లో ఒకింత నైరాశ్యం కనిపిస్తుంది. దీంతో కిషన్‌రెడ్డి ఇక్కడ కాలికి బలపం కట్టుకొని మరి వర్షాన్ని లెక్క చేయకుండా పర్యటిస్తున్నారు. బీజేపీ అభ్యర్థికంటే ఎక్కువగా నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

### ప్రతిష్టాత్మక యుద్ధం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు ఇప్పుడు రాజకీయ యుద్ధంగా మారాయి. కాంగ్రెస్‌కు ఇది ప్రజాభిప్రాయ పరీక్షగా నిలువగా, బీఆర్ఎస్‌కు పునరుజ్జీవ పోరుగా, బీజేపీకి రాష్ట్ర వ్యాప్తంగా బలపరిచే అవకాశంగా భావిస్తున్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతోపాటు ఓటర్లను ఆకర్షించే ప్రయ్నతం చేస్తున్నారు. దీనికితోడు నాయకుల మాటలు తూటాల్లా పేలుస్తున్నారు. వేరే పార్టీ అభ్యర్థులు గెలిస్తే సంక్షేమ పథకాలు బంద్ పెడుతాంటూ, బీజేపీ కార్పెట్ బాంబింగ్ చేస్తుందంటూ, పాకిస్తాన్ తంతే వెనక్కి వచ్చారంటూ రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభల్లో వ్యాక్యలు చేశారు. కేటీఆర్ హిందీలో షాయరీలు చెబుతూ అందరి దృష్టిని తనవైపు మరల్చుకుంటున్నారు. మరోవైపు కిషన్‌రెడ్డి తనదైన వాగ్ధాటితో ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకటే నంటూ లోపాయికారి ఒప్పందంతో ముందుకు సాగుతున్నారని విమర్శిస్తున్నారు. వీరు ముగ్గురు అభ్యర్థుల గురించి ఎన్నికల ప్రచారంలో చెప్పడం కన్నా తమ పార్టీల గురించి, ప్రతిపక్షాల పార్టీల గురించి, నేతల గురించి చేస్తున్న విమర్శలే అధికంగా వినిపిస్తున్నాయి. దీనికితోడు పార్టీల అగ్రనాయకులు వస్తుండటంతో ప్రజలు సైతం అభ్యర్థులను మరిచి నాయకులకే జై కొడుతున్నారు. ఈ ఎన్నికల్లో ఫలితం ఏదైనా తెలంగాణ రాజకీయ దిశను నిర్ణయించే సూచికగా నిలువనుంది. ఈ ఉప ఎన్నికల్లో పార్టీ కంటే నాయకుల ప్రతిష్ట, స్థానిక సమస్యల కంటే రాష్ట్ర స్థాయి రాజకీయ ప్రభావం ప్రజల నిర్ణయంతో ముడిపడనుంది.

## కార్తీకమాసంలో కోటిదీపోత్సవం నిర్వహించటం అభినందనీయం

**-రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**



**ముషీరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త:**

కార్తీకమాసంలో కోటిదీపోత్సవం నిర్వహించటం అభినందనీయమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటిదీపోత్సవం కార్యక్రమంలో నాలుగవ రోజైన మంగళవారం ఆయన సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ కార్తీకమాసం శివునికి ఎంతో ప్రీతికరమని, అటువంటి కార్తీకమాసంలో కోటిదీపోత్సవంలో పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పూర్ణబోధ వేదవిద్యాగురుకులం వారిచే వేదపఠనం, కాకునూరి సూర్యనారాయణమూర్తిగారి ప్రవచనం, విష్ణుమూర్తి విగ్రహాలకు సత్యనారాయణస్వామి వ్రతం, శ్రీరంగం శ్రీరంగనాథస్వామి కళ్యాణోత్సవంలతో పాటు వ్యాసాశ్రమం పీఠాధిపతి శ్రీపరిపూర్ణానందగిరిస్వామి, హాళిపురం పీఠాధిపతి శ్రీవామనాశ్రమ స్వామిల ఆశీర్వచనాలతో కార్యక్రమం ఘనంగా ముగిసింది.



నగరంలో మంగళవారం జోరుగా వర్షం కురిసింది. భారీగా వర్షపు నీరు చేరడంతో చార్మినార్ ప్రాంతంలో రహదారులు జలమయం అయిన దృశ్యం

## ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

**-అమెరికా వెళ్లడంతో ఇల్లు గుల్ల**

**-పిడి చట్టంతో పాటు సుమారు 25 దొంగతనం కేసులు**

**-రూ.30 లక్షల బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల స్వాధీనం**

**ఎల్.బి.నగర్, నవంబర్ 4 ప్రభాతవార్త:**



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు వెండి

ఇండ్లలో దింగతనాలకు పాల్ప డే ఇద్దరు అంతరాష్ట్ర దింగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలు వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఎల్బీనగర్ ఏసిపి ఏ.కృష్ణయ్య నేరాలకు సంబంధించిన పూర్తి వివ రాలను వెల్లడించారు. జగ్జీవన్‌రామ్‌కాలనీ, చిల్కూర్ గ్రామం, సూర్యపేట జిల్లా, స్వగ్రా మం వల్లాపురం, నడిగూడెం మండలం, సూర్యపేట జిల్లాకు చెందిన డ్రైవర్ గా పనిచేసే కిన్నెర మధు(37), శ్రీనివాసనగర్‌కాలనీ, ఎల్.బి.నగర్, స్వగ్రామ పరిటాలవారి పాలెం, సంత మఖుగూరు మండలం, బాపట్ల జిల్లా కు చెందిన ఉప్పుటూరి నవీన్ కుమార్ అలియాస్ నవీన్(35)లు తాళం వేసి ఉన్న నివాసాలలో దింగతనాలకు పాల్పడేవారు. నాగోల్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో భాస్కర్ ప్రమీలాలు నివాసం ఉంటారు. వారు అమెరికా వెళ్లడంతో అది పసిగట్టి వారి ఇంట్లోకి చొరబడి దింగతనానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని పరిశీలించిన సమీప నివాసస్తులు వెంటనే అమెరికాలో ఉన్న ప్రమీలకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న ప్రమీల ఈ విషయాన్ని నగరంలో ఉండే తన తమ్ముడు శ్రీనివాస్‌కు తెలియజేయడంతో నాగోల్ పోలీస్ స్టేషన్ వచ్చిన శ్రీనివాస్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా కిటికీ గ్రిల్స్ విరగ్గొట్టి పడక గదిలోకి చొరబడి అలమారిలోనే బంగారం వెండి వస్తువులను దింగిలించినట్లు గుర్తించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మధు, నవీన్‌కుమార్ పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.30 లక్షల విలువచేసే బంగారం నగలు, వెండి, మొబైల్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు జతల బంగారు గాజులు, మూడు జతల బంగారు గాజు లు, రెండు జతల కొత్త బంగారు గాజులు, ఒక రూబి చిన్న నెక్లెస్, సిజెడ్ చిన్న నెక్లెస్, చంద్ర హారము, ఒక చిన్న నల్లపూసల గొలుసు, మరొక నల్లపూసల గొలుసు, 4 బంగా రు ఉంగరాలు, మొత్తం 30 తులాల బంగారు ఆభరణాలు, అదేవిధంగా ఒక కిలో బరు వున్న 2 వెండి ప్లేట్లను, నేరానికి ఉపయోగించిన హోండా యాక్టివా, మోటార్ సైకిల్ నెంబర్ టిఎస్ 08 ఈయూ 7998, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించా రు. కాగా కిన్నెర మధుపై చైతన్యపురి పోలీస్‌స్టేషన్ లో వ్యభిచారం కేసు, పిడి చట్టం తో పాటు సుమారు 25 దింగతనం కేసుల్లో జైలుకు వెళ్లి శిక్ష అనుభవించాడని తెలిపారు. ఈ కేసు విషయంలో చాకచక్యంగా వ్యవహరించి నేరస్తులను పట్టుకోవడంతో పాటు బం గారు ఆభరణాలు వెండి వస్తువులను కాపాడిన ఎస్ఐలు పి. శివనాగప్రసాద్, ఎస్. నర్సింహా, ఏఎస్ఐ కె.రవియాదవ్, క్రైమ్ సిబ్బంది శర్ఫుద్దీన్, కె.సుభాష్, జె.సాయిష్, శ్రీకాంత్‌యాదవ్, నరేశ్ కుమార్, హిమబిందులను రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ప్రశంసించారు.

## ఇంటి నుంచే ఓటు

**- 97 మంది ఓటేశారు**

**- నమోదై ఓటు వేయని వారికి మరో అవకాశం**



హోం ఓటింగ్‌లో భాగంగా ఒక వృద్ధుడి నివాసం వద్ద ఎన్నికల అధికారులు.

**జూబ్లీహిల్స్, నవంబరు 4, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటు శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఓట్ ఫర్ ష్యూర్ పేరుతో ప్రచారాన్ని నిర్వహిస్తున్న అధికారులు వృద్ధులు, వికలాంగులు, శారీరక వైకల్యంతో బాధపడేవారికి ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించేందుకు అవసరమైన 'హోం ఓటింగ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దాదాపు 103 మంది వృద్దులు, వికలాంగులు హోం ఓటింగ్ జాబితాలో నమోదు చేసుకున్నారు. వీరిలో మంగళవారం 97 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారి కర్ణన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వయసు మీదపడి బయటకు రాలేని వృద్ధులు, శారీరక వైకల్యం ఉన్న వారికి ఈ విధానం ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. గత రెండు రోజులుగా జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రత్యేక బృందాలు ఫారం 12డి దరఖాస్తు చేసిన ఓటర్ల ఇళ్లకు చేరుకొని పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయించే కార్యక్రమం చేపట్టాయి. ప్రతి ఇంటికి ఇద్దరు ఎన్నికల సిబ్బంది, ఒక సెక్యూరిటీ అధికారి, మైక్రో అబ్జర్వర్ హాజరవుతున్నారు. సీసీ కెమెరాల సాయంతో ఈ మొత్తం ప్రక్రియను రికార్డు చేస్తున్నారు. దాదాపు 85 ఏళ్లు దాటిన వృద్ధులకు, వికలాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే సదుపాయం కల్పించినట్లు యూసుఫ్‌గూడ సర్కిల్-19 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఓటు రహస్యంగా, చట్టపరంగా నమోదు అవుతుందని, ఎవరికి ఏ పార్టీకి ఓటు వేశారో ఎవరికి తెలియదని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్లు సీల్డ్ కవర్లో సేకరించి, కౌంటింగ్ రోజున ఇతర ఓట్లతో కలిపి లెక్కిస్తారన్నారు. కాగా మిగిలిన వారికి రెండో రోజుల్లో మరోసారి ఓటు వేసే అవకాశం కల్పిస్తామని రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

## వైన్‌షాప్ మాకు ఇచ్చేయండి ..గుడ్‌విల్ ఇస్తాం!

**-లక్కీడ్రాలో గెలుపొందిన వారికి బడా లిక్కర్ వ్యాపారుల ఆఫర్లు**

**-లైసెన్స్‌తమకు అప్పజెప్పితే వాటా, డబ్బు ఇస్తామని హామీ**

**-పూర్తి బాధ్యత లైసెన్స్ దారులదే అంటున్న ఎక్సైజ్ అధికారులు**



**హైదరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త:**

నూతన మద్యంపాలసీలో అధికారులు ఎన్ని మార్పులు చేర్పులు చేసినా..ఎన్ని నిబంధనలు పెట్టిన మద్యం దుకాణాలు మాత్రం ఎవరికి దక్కాలో వారికే దక్కుతున్నాయి. ఇటీవల గ్రేటర్‌లో మద్యం దుకాణాలకు డ్రా నిర్వహించి విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో దుకాణాల్లో దక్కిన వారిలో 70శాతానికి పైగా పాతవారేఉన్నారు. అయితే మిగతా 30శాతం వారు కూడా కొత్తవాళ్లు దక్కించుకున్నారు. అయితే పలు ప్రాంతాల్లో దుకాణాలు దక్కించుకున్న లైసెన్స్‌దారులపై తమకు పలుకుబడి ఉన్నఅధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల కాచిగూడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఓమద్యం దుకాణం కొత్తవారికి దక్కింది. ఈనేపథ్యంలో ఆప్రాంతంలో గతకొన్నేళ్లుగా మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నవారు కొత్తగా దక్కించుకున్నవారిపై ఒత్తిడి తీసుకొచ్చారు. గుడ్ విల్ కింద ఎంతోకొంత ఇస్తామని, దుకాణాన్ని తమకు అప్పజెప్పాలన్నారు. దీంతో మొదట్లో ఒ ప్పుకోని ఆలైసెన్స్‌దారుడు చివరికి తాను కోరినంతా ఇస్తామనడంతో ఒప్పుడుకున్నాడు. అలాగే ఎల్బీనగర్ ప్రాంతంలో కొత్తగా వైన్‌షాప్ దక్కించుకున్న ఓవ్యక్తికి వైన్‌షాప్ తమవారికి ఇచ్చేస్తే గుడ్‌విల్ ఇవ్వడంతోపాటు, 10వాటా కూడా అప్పజెప్పుతామని, మీరుకట్టిన 3లక్షలు అప్లికేషన్ ఫీజుకు మూడింతలు ఇస్తామని కొందరు నేతలు ఫోన్‌లు చేసి అడుగుతున్నారని లక్కీడ్రాలో గెలుపొందిన ఓవ్యక్తి తెలిపారు. ఇలా గ్రేటర్ వ్యాప్తంగా మద్యం దుకాణాలు దక్కించుకున్న కొత్తవారికి పలువురు పాత వ్యాపారులను నుంచి వేదింపులు తప్పట్లేదు.

### అధికారులు సైతం మధ్యవర్తిత్వం..

లక్కీడ్రాలో గెలుపొందిన వారినికి కొందరు రాజకీయ నేతల ద్వారా వేధిస్తుంటే మరికొందరు ఎక్సైజ్‌శాఖ అధికారుల ద్వారా మధ్యవర్తిత్వం నడుపుతున్నారు. అయితే డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే కొత్తవారికి షాపులు దక్కడంతో వారిపై ఒత్తిడి మరింత పెరుగుతుంది. ముఖ్యంగా కొత్తగా దుకాణాలు దక్కించుకున్నవారికి ఈవ్యాపారంలో అనుభవం పెద్దగా లేకపోవడం, అద్దె అధికంగా చెల్లించాల్సి వస్తుండటంతో నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తుందేమోనన్న భయం నెలకొంది. ఈనేపథ్యంలో ఇదే అదునుగా భావిస్తున్న పలువురు బడావ్యాపారులు లైసెన్స్‌ఫీజు, దరఖాస్తు ఫీజును చెల్లించడంతో పాటుగా గుడ్‌విల్ కింద 20 నుంచి 40లక్షల వరకు చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో దుకాణాల్లో వాటాదారులగా కూడా చేర్చుకుంటున్నారు. ముఖ్యంగా ముఖ్యంగా ఏపీకి చెందిన పలువురు బడా లిక్కర్ వ్యాపారులు తెలంగాణలో ముఖ్యంగా గ్రేటర్‌లో శివారు ప్రాంతాల్లో కొత్తగా దుకాణాలు దక్కించుకున్నవారి వివరాలు సేకరించి వారితో మాట్లాడుతున్నారు. ఏ ఇబ్బంది కాకుండా తాము చూసుకుంటామని అవసరమైతే మీకువాటా ఇస్తామని హామీలు ఇస్తున్నారు. అయితే ఈవ్యవహారంపై ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించగా లైసెన్స్‌దారులు గుడ్‌విల్ కింద దుకాణాన్ని ఇతరులకు అప్పజెప్పినప్పటికీ అబ్కారీశాఖ రికార్డుల్లో పేరు మాత్రం మారదన్నారు. గుడ్‌విల్‌కింద తీసుకున్నవారు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా అక్రమాలకు పాల్పడితే దానికి పూర్తి బాధ్యత లైసెన్స్ దారుడి దేనని పేర్కొంటున్నారు.

## మెట్రోరైల్‌లో దారుణం

**-వృద్ధుడిని ట్రాక్‌పైకి తోసేసిన యవకులు..అరెస్టు**

**హైదరాబాద్, నవంబరు 4, ప్రభాతవార్త:**

హైదరాబాద్ మెట్రో రైలులో దారుణం జరిగింది. సీనియర్ సిటిజన్లకు కేటాయించిన సీటు తనకు ఇవ్వాలంటూ కోరిన ఓ వృద్ధుడిపై ముగ్గురు యువకులు దారుణానికి ఒడిగట్టారు. రైల్వే ట్రాక్‌పైకి నెట్టి దాడి చేశారు. పోలీసుల వివరాల మేరకు.. అమీర్‌పేట్ నుండి మెట్రోలో ప్రయాణిస్తున్న 62 ఏళ్ల వృద్ధుడితో ముగ్గురు యువకులు దురుసు ప్రవర్తించారు. సీనియర్ సిటిజన్లకు కేటాయించిన సీటును ఇవ్వమని కోరగా యువకులు దుర్భాషలాడి అవమానించారు. లక్డీ కాపూల్ మెట్రో స్టేషన్ వద్ద ముగ్గురు యువకులు వృద్ధుడిని రైల్వే ట్రాక్‌పైకి నెట్టి గాయపరిచారు. బాధితుడు వెంటనే ఘటనను సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి వేగంగా దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. విచారణ చేపట్టిన కోర్టు నిందితులకు రిమాండ్ విధించింది. నిందితులు సివ్వల సునీల్ కుమార్ (32), సివ్వల రాజేష్ (34), కాలిశెట్టి అశోక్ (34) అని తెలుస్తోంది.

### విజయనగర్ కామర్స్ విద్యార్థికి రెజ్లింగ్ రజత పథకం

**నాంపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త :** ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంటర్ కళాశాలలకు నిర్వహించిన రెజ్లింగ్ టోర్నీలో విజయనగర్ కాలనీ కామర్స్ కళాశాల డిగ్రీ విద్యార్థి పి.రోహన్ అద్భుత ఆటను ప్రదర్శించి తన సత్తాచాటుకున్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఈ టోర్నీలో రోహన్ 55కిలోల బరువు విభాగం రెజ్లింగ్ పోటీల్లో రజత పథకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వి.రమణమూర్తి రోహన్‌ను ఎంతగానో అభినందించారు. ముమ్ముందు మరింత మెరుగైన ఆటతీరుతో మరెన్నో విజయాలు,పథకాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు,రోహన్‌ను అభినందనలతో ముంచెత్తారు.

## రియల్ ఎస్టేట్ అసోసియేట్స్‌కు హెల్త్ కార్డులు ఇవ్వాలి

**-తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నేతలు**



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షులు నారగోని ప్రవీణ్

**ముషీరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ అసోసియేట్స్ అందరికీ తక్షణమే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నారగోని ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నరసయ్యలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 18న రాష్ట్ర ప్రభుత్వానికి హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందచేస్తున్నామని తెలిపారు. హెచ్ఎండిఏ, డిటిసిపీ బిల్డింగుల కోసం దరఖాస్తు చేసుకున్న 100 రోజుల్లో అనుమతి ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర రియల్ ఎస్టేట్ వ్యాపారం స్తబ్దుగా ఉన్నందున చాలామంది ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, వారందరినీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ చివరినాటికి రాష్ట్రంలోని అన్ని జిల్లా కమిటీల సమావేశాలను నిర్వహించాలని తీర్మానించారు. అదేవిధంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను డిసెంబర్ 20నాటికి పూర్తి చేసి విడుదల చేయాలని మరో తీర్మానంలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రమేష్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్‌రావు, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ రీత్నారెడ్డి,వివిధ జిల్లాల నాయకులు మహ్మద్, చంద్రారెడ్డి, రాజేష్, భూపాల్‌రెడ్డి, అడపల్లి కృష్ణారావు, పునరెడ్డి, జైపాల్‌రెడ్డి, కాకునూరి సుధాకర్, సోమయ్య, శేఖర్‌గౌడ్,అబ్దుల్ అలీమ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి

**టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నిత్యం రోడ్డు ప్రమాదాల బారిన పడి అమాయక ప్రజలు మరణించటం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు, ప్రజలకు మేలు చేయాలని చేపట్టిన డ్రంకన్ డ్రైవ్ కార్యక్రమం కొంతమంది పోలీస్ అధికారుల పాలిట కల్పవృక్షంగా మారింది తప్ప, రోడ్డు ప్రమాదాలను ఏమాత్రం అదుపుచేయటం లేదనటానికి నిన్న జరిగిన తాండూరు బస్సు ప్రమాద ఘటనే ఉదాహరణ అన్నారు. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ వెహికల్ ఫిట్నెస్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తూ ఉంటే ఈ ప్రమాదాలను అరికట్టవచ్చునని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అవినీతిలో మునిగిపోయిన ఆర్టిఏ రంగాన్ని చక్కదిద్ది, అన్ని వాహన పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని, ఇకపై ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, దక వినోద్, కిరణ్ పాల్గొన్నారు.

## వీకర్‌సెక్షన్ కాలనీలకు మంచినీటిని సరఫరా చేయాలని ఎండికి వినతి



బండ్లగూడ కార్పోరేషన్ ఒకటో వార్డులో ఉన్న వీకర్ సెక్షన్‌ల కాలనీలో మంచినీటిని సరఫరా చేయాలని జల మండలి ఎండికి వినతిపత్రం ఇస్తున్న మాజీ కార్పోరేటర్ చంద్రశేఖర్.

**నార్సింగి, నవంబర్ 4 ప్రభాతవార్త :**
బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ ఒకటో వార్డులో ఉన్న వీకర్ సెక్షన్ కాలనీలకు మంచినీటిని సరఫరా చేయాలని కోరుతూ మాజీ కార్పోరేటర్ తలారి చంద్రశేఖర్ మంగళవారం జల మండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒకటో వార్డులో ఉన్న వెంకటేశ్వర కాలనీ, విద్యానగర్ ఫేజ్-2, దత్తాత్రేయ నగర్ కాలనీలు ఏర్పడి రెండు దశాబ్దాలు అవుతున్నా నేటికీ మంచినీటి కనెక్షన్ ఇవ్వలేదన్నారు. అన్ని కాలనీలతో సమానంగా వీకర్ సెక్షన్ కాలనీల ప్రజలు ఆస్తిపన్ను చెల్లిస్తున్నా అధికారులు ఎందుకు మంచినీటి సరఫరా చేయడంలో వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. అనేకమార్లు జల మండలి అధికారులను కలిసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరినా ఎవరూ స్పందించడం లేదని, చివరిగా ఎండిని కలిసి వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. ఎండి అశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, వీలైనంత త్వరగా మంచినీటిని సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారని చంద్రశేఖర్ వివరించారు. ఎండికి వినతిపత్రం అందజేసిన వారిలో శివసాయి నగర్ కాలనీ ప్రతినిధులు రమణారెడ్డి, సురేందర్ తదితరులు ఉన్నారు.

## యువతలో దేశభక్తి నింపటమే యూనిటీ మార్చ్ ప్రధాన లక్ష్యం

**-సర్దార్ 150 ఏక్తా మార్చ్ గోడప్రతులను ఆవిష్కరించిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్**




సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్

**ముషీరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త:** యువతలో దేశభక్తి నింపటమే యూనిటీ మార్చ్ ప్రధాన లక్ష్యమని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ స్పష్టం చేశారు. మంగళవారం కవాడిగూడ సీజీవో టవర్స్‌లోని పీఐబీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన సర్దార్ 150 ఏక్తామార్చ్ గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని, ఆయన గౌరవార్థం నిర్వహిస్తున్న యూనిటీ మార్చ్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా యువతలో చైతన్యం నింపి, దేశభక్తి ఇనుమడింపచేయటానికి అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 వరకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి పాదయాత్రలో యువత చురుకుగా పాల్గొనాలని కోరారు. దేశ సమైక్యత, స్వదేశీ నినాదంతో మాదక ద్రవ్యాలు లేని భారత్ వంటి ఆదర్శాలను యువత నిలబెట్టాలని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు దోహదపడాలని అన్నారు. కుల మత భేధాలు లేకుండా జాతీయ సమైక్యతను సాధించటంలో సర్దార్ పటేల్ నాయకత్వం కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. సర్దార్ పటేల్‌కు తెలంగాణతో ప్రత్యేక అనుబంధం ఉందని, హైదరాబాద్‌ను భారత్‌లో విలీనం చేయటంలో సర్దార్‌పటేల్ ఎనలేని కృషి చేశారని, లేదంటే నేటికీ తెలంగాణ ఇస్లాం రాజ్యంగానో లేదా పాకిస్తాన్‌లోనో కలిసిపోయి ఉండేదని అన్నారు. సర్దార్ పటేల్ ఆశయం అయిన సమైక్య భారత్‌ను ముందుకు తీసుకువెళ్లటం మనందరి సమిష్టి కర్తవ్యమని పేర్కొన్నారు. ఉక్కుమనిషి అయిన సర్దార్ పటేల్ జీవితం గురించి భావితరాలకు తెలియచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో యూనిటీ మార్చ్ కన్వీనర్ మాధవి కొల్లి, సామల పవన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా యువజన అధికారి సైదానాయక్, మై భారత్ హైదరాబాద్ జిల్లా యువజన అధికారి ఖుష్బూగుప్తా పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన దాశరథి జీవిత చరిత్ర



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహారెడ్డి, కమలారెడ్డి, బాలాచారి, ఉదయవర్లు, నీరజ తదితర అతిథులు

**రవీంద్రభారతి, నవంబరు 4 ప్రభాతవార్త :** నిజాం నిరంకుశ దుష్టపాలన నుండి విముక్తిచేయడానికి తన ప్రాణాన్ని లెక్కచేయక ఉద్యమంలో పాల్గొంటూ అద్భుత రచనలతో, ప్రసంగాలతో ప్రజలను చైతన్యపరిచిన ప్రజాకవి దాశరథి జీవిత చరిత్ర, రచనల్ని నేటికీ ప్రతీఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డి.కమలారెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా. ఏనుగు నరసింహారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ రాష్ట్ర అరసం ప్రధాన కార్యదర్శి డా. రాపోలు సుదర్శన్ పిల్లల కోసం సులువుగా అర్థమయ్యేరీతిలో వచనంలో రచించిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య జీవిత చరిత్ర పుస్తకాన్ని నరసింహారెడ్డి విశిష్ట అతిథులు సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. ఎన్.బాలాచారి, తెలుగుభాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు, సాహితీవేత్త డా. అమరవాది నీరజ, రచయిత రాపోలు సుదర్శన్ దంపతులు, కెవిఎల్ తదితరులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. దాశరథి కృష్ణమాచార్య ఎవరు ? ఆయన గురించి రాపోలు సుదర్శన్ ఎందుకు వ్రాసారో ముఖ్యంగా తెలంగాణలో పుట్టిన 15ఏళ్లలోపు పిల్లలకు దాశరథి జీవితచరిత్ర తప్పక అవగతం కావాలన్నారు. అయితే ముందుగా తెలంగాణ నేలస్వభావం కొంత తెలిస్తే కవి దాశరథి ఏరూపంలో ఉంటారో అర్థమౌతుందన్నారు. దాశరథిపై జరుగుతున్న కృషిని బాలాచారి తెలుపగా, దాశరథి చమకులు టి.ఉదయ వర్లు, పుస్తక వైశిష్ట్యాన్ని అమరవాది నీరజ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో దాశరథి అల్లుడు గౌరీశంకర్, నరహరి, జయరావు, ఆర్ఎస్ఆర్‌సి.కుమార్ పాల్గొన్నారు.

## విద్య ప్రమాణాలను పెంచుకోవడానికి కృషి చేయాలి

**-కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ మల్లవరపు బాలలత**



కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్,సిఎస్‌బి ఐఏఎస్ అకాడమీ అధినేత్రి మల్లవరపు బాలలతను సత్కరిస్తున్న నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ డైరెక్టర్, చిత్రంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కె.కిరణ్ కుమార్, టెక్నికల్ సొసైటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిప్రసాద్ రెడ్డి

**చిక్కడపల్లి నవంబర్ 4 (ప్రభాతవార్త):**
శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటుగా నూతనంగా వస్తున్న విద్య ప్రమాణాలను పెంచుకోవడానికి కృషి చేయాలని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్, సి ఎస్ బి ఐ ఏ ఎస్ అకాడమీ అధినేత్రి మల్లవరపు బాలలత అన్నారు.ఇదే అంశాలను ఇటీవల కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థ, వరంగల్ నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఆహ్వానం మేరకు టెక్నాజియోన్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించడం జరిగిందన్నారు. ఇటువంటి గొప్ప సంస్థలలో చదువుకున్న వారంతా నేడు రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశంతో పటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలల్లో తెలుగు వారంతా తమ తమ పరిధులలో సేవలందిస్తున్నారన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ .బిద్యాధర్ సుబుద్ధి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్బంగా విద్యార్థిని విద్యార్థులు అడి గిన పలు ప్రశ్నలకు, సందేహాలను బాలలత నివృత్తి చేసారు.

## నిర్మలమైన మనస్సుతో ఉంటే జీవితం బంగారుమయం : డాక్టర్ అమిర్ క్విర్ కెఫిర్



ప్రసంగిస్తున్న ప్రపంచప్రసిద్ధ సంస్థాగత కన్సల్టెంట్ డాక్టర్ అమిర్ క్విర్ కెఫిర్

**చిక్కడపల్లి నవంబర్ 4 (ప్రభాతవార్త):** కుటుంబంలో పరస్పరం అవగాహనా, నిర్మలమైన మనస్సుతో ఉంటె జీవితం బంగారుమయం అవుతుందని ప్రపంచప్రసిద్ధ సంస్థాగత కన్సల్టెంట్, నాయకత్వ నిపుణుడు అమిర్రర్ గ్రూప్ వ్యవస్థాపకుడు డాక్టర్ అమిర్ క్విర్ కెఫిర్ అన్నారు. మంగళవారం బాగ్ లింగంపల్లి డా. బి. ఆర్. అంబేద్కర్ విద్య సంస్థల ఆధ్వర్యంలో"నాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్ - ది ఆర్ట్ ఆఫ్ ఎవ్రిడే పీస్ మేకింగ్ అనే అంశంపై ఒక అవగాహనాత్మక ప్రేరణాత్మక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ అమిర్ క్విర్ కెఫిర్ మాట్లాడుతూ ముఖ్యంగా వ్యక్తిగత కుటుంబ విభేదాలను సహానుభూతి, పరస్పర గౌరవం, నిర్మలమైన సంభాషణ ద్వారా పరిష్కరించే మార్గాలపై దృష్టిని సారిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు.నాన్‌ఫ్లిక్ట్" పద్ధతి ద్వారా విభేదాలను అవగాహన అభివృద్ధికి దారితీసే అవకాశాలుగా మార్చుకోవచ్చని వివరించారు. కార్యక్రమం లా కాలేజ్ ప్రిన్సిపల్ డా. సృజన, ప్రిన్సిపల్ విటలాచార్య, డి. సంతోష్ , హెచ్.ఆర్. విభాగానికి చెందిన శ్రీమతి సునీత తదితరులు డా. అమీర్ క్విర్ లను సన్మానించారు.దని పునరుద్ఘాటిస్తూ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## దారిదోపిడీలకు పాల్పడ్డ ఐదుగురు అరెస్ట్

**-నిందితుల నుంచి రెండు కుత్తులు, సెల్‌ఫోన్లు,నగదు స్వాధీనం**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర మండలం డిసిపి రష్మి పెరుమాల్

**కంటోన్మెంట్,నవంబర్ 4 ప్రభాతవార్త:**
మద్యానికి బానిసలుగా మారిన స్నేహితుల ముఠా దాడి దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురిని బేగంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు విలేకర్ల సమావేశంలో డిసిపి సాధన రష్మి పెరుమాల్ మాట్లాడుతూ మడ్‌పోర్ట్ ప్రాంతానికి చెందిన వన్నం రాజేశ్ 18 ఆటో డ్రైవర్, బోయ నర్సిహ్మా, చెత్త డంపింగ్ వర్కర్, జెబిఎస్ సమీపంలోని పికెట్ ప్రాంతానికి చెందిన, బి.కార్తీక్ 18,పరశరామ్, శివ,సీసీఎల్ అనే వ్యక్తులు స్నేహితులు కలిసి ప్రతి రోజు మద్యం సేవించి దారిదోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 3వ తేదీన కళ్యాన్ అనే వ్యక్తి తన స్నేహితుడు గోపిని జెబిఎస్ సమీపంలోని మెట్రో ఫిల్లర్ నెం 918 వద్ద వదిలేశాడు. అతన్ని రాజేశ్,నర్సింహ్మా,కార్తీక్,శివలు మద్యం సేవించి కత్తులు చూపించి డబ్బులు డిమాండ్ చేశారు. అతని జేబులో ఉన్న 28 వేల 500 రూపాయలను బలవంతంగా లాక్కొని ఆటోలో జెబిఎస్ వైపు పారిపోయారు. బాధితుడు కళ్యాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఫుటేజీల ఆధారంతో వారిని 24 గంటల్లో పట్టుకొని అరెస్టు చేశారు. దారిదోపిడీలకు పాల్పడుతున్న వీరు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దారి దోపిడీలకు పాల్పడినట్లు గుర్తించినట్లు వారు తెలిపారు. నిందితుల నుంచి రెండు కత్తులు, రెండు సెల్‌ఫోన్లు, నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఘటనలు ఎదురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిసిపి సూచించారు.

## జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సూచనలు

**జీడిమెట్ల, నవంబర్ 4, ప్రభాతవార్త**
జీడిమెట్ల పరిధిలోని పైప్ లైన్ రోడ్డులో జరుగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా మంగళవారం నుండి పనులు పూర్తయ్యే వరకు కింది మార్గాలలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధించబడినవని జీడిమెట్ల ట్రాఫిక్ సిఐ నరసింహ రావు తెలిపారు.

**ముఖ్యమైన మళ్లింపులు.. రహదారి మూసివేతలు.. భారీ వాహనాలపై ఆంక్షలు:**
జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డుపై జరుగుతున్న స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల కారణంగా ప్రజల భద్రత కోసం, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు తాత్కాలిక ట్రాఫిక్ మళ్లింపులు ఆంక్షలు అమలు చేయబడుతున్నాయి.

**సుచిత్ర వైపు వెళ్ళే వాహనాలు:**
గాజులరామారం, షాపూర్ నగర్, రంగభుజంగ నుండి సుచిత్ర వైపు వెళ్ళే వాహనాలుసాయి కంట జంక్షన్ వద్ద కుడివైపు మళ్లి అయోధ్య నగర్ కుత్బుల్లాపూర్ జంక్షన్ సుచిత్ర దిశగా ప్రయాణించాలి.

**కొంపల్లి వైపు వెళ్ళే వాహనాలు:**
గాజులరామారం, షాపూర్ నగర్, రంగభుజంగ నుండి కొంపల్లి వైపు వెళ్ళే వాహనాలు సాయి కంట జంక్షన్ వద్ద ఎడమవైపు మళ్లి సుభాష్ నగర్ దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియా దూలపల్లి గ్రామం కొంపల్లి వైపు వెళ్లాలి. ఉదయం నుండి రాత్రి వరకు భారీ వాహనాల రాకపోకలు నిషేధించబడినవి. ప్రజలు ప్రయాణంలో ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రత్యామ్నాయ మార్గాలు ఉపయోగించి, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించగలరని జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరసింహారావు కోరారు.

## అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధం : కపిలవాయి దిలీప్ కుమార్




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్, ఇందిరా తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 4,ప్రభాతవార్త:**
మహ్మద్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం రాజ్యాంగవిరుద్ధమని రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యకులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. ఈమేరకు మంగళవారం సోమజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం విధానపరమైన ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్ల స్ఫూర్తికి ఆయన నియామకం విరుద్ధమన్నారు. ప్రస్తుతం కోడ్ అమలులో ఉన్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సుమారు లక్ష ఇరవైవేల మంది ఓట్లను ప్రభావితం చేయడానికి ఉద్దేశించిన రాజకీయచర్యగా పేర్కొన్నారు. దీనిపై తెలంగాణ గవర్నర్, భారత ప్రధాన ఎన్నికల కమీషనర్, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారులు అజారుద్దీన్ నియామకాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరారు. అలాగే ఉప ఎన్నికల కాలంలో ఆయన జుబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటించకుండా నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. మహిళా అధ్యకురాలు కె. ఇందిరా మాట్లాడూతూ, చేవెళ్ల నియోజకవర్గంలో జరిగిన భారీ రోడ్డు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు రాష్ట్రీయ లోక్ దళ్ తరుపన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. తెలంగాణలోని అన్ని రహదారులను డబుల్ లేసులుగా విస్తరించాలని, అలాగే రోడ్డపై నడుస్తున్న వేలాది అన్ఫిట్ వాహనాలను తక్షణమే తొలగించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతి బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. ఎస్. బైగ్ హైదరాబాద్ అధ్యక్షుడు బీరప్ప, యాదాద్రి భువనగిరి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు రిషభ్, విశాల్, మల్లేశ్, నరసింహరావు, సిద్ధం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి : సిఐ భాస్కర్




సమావేశంలో మాట్లాడుతున్న కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె.భాస్కర్

**చార్మినార్,నవంబరు 4 ప్రభాతవార్త :**
యువత మాదకద్రవ్య అలవాట్లకు దూరంగా ఉండాలని,మంచి క్రమశిక్షణతో చదువుకుంటే తప్పకుండ ఉన్నత రంగాలలో రాణిస్తారని కామాటిపుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జె.భాస్కర్ అన్నారు.కామాటిపుర పోలీస్ స్టేషన్,రాయల్ పారా మెడికల్ ఒకేషనల్ కళాశాల సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతాయని,విచక్షణాన్ని కోల్పోయి నేరాలు చేసే అవకాశాలు ఉంటాయని తెలిపారు. యువత దేశానికి వెన్నుముఖ లాంటి వారని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన తెలియజేశారు.రాయల్ పారా మెడికల్ ఒకేషనల్ కళాశాల విద్యార్థులకు ఈ సందర్భంగా డ్రగ్స్‌పై అవేర్‌నెస్ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కామాటిపుర పోలీస్ స్టేషన్ డిఐ లెనిన్,కళాశాల డైరెక్టర్ న్యాయవాది మహ్మద్ సాజిద్ అలీ,వైస్ ప్రిన్సిపాల్ గులాం ముస్తాబాతో పాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### జాతీయ ఫుట్‌బాల్ సెన్సేషన్స్‌కు విద్యార్థి యాసర్ ఖాన్ ఎంపిక



జాతీయ ఫుట్‌బాల్ సెన్సేషన్స్‌కు ఎంపికైన విద్యార్థి యాసర్ ఖాన్‌ను అభినందిస్తున్న దృశ్యం

**చార్మినార్,నవంబరు 4 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతబస్తీ జహనుమాలోని సెయింట్ మార్ట్స్ బాయిస్ టౌన్ హైస్కూల్ తొమ్మిదివ తరగతి విద్యార్థి మహ్మద్ యాసర్ ఖాన్ జాతీయ యువ ఫుట్‌బాల్ సెన్సేషన్స్‌కు ఎంపిక అయ్యారు.జహనుమా ప్రాంతానికి చెందిన తొమ్మిదివ తరగతి విద్యార్థి యాసర్ ఖాన్‌ను ఏఐఎఫ్ఎఫ్,ఎఫ్ఐఎఫ్ఏ టాలెంట్ అకాడమీ జాతీయ యువ ఫుట్‌బాల్ సెన్సేషన్స్‌కు ఎంపిక చేశాయి.కాగా సెయింట్ మార్ట్స్ బాయిస్ టౌన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ శౌర్ రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ ఆరోగ్యం పసల,పిఇటీలు పాపిరెడ్డి, వినయ్‌రెడ్డి, పిఇటీ విభాగం కలిసి విద్యార్థి యాసర్ ఖాన్‌ను అభినంధించారు.జాతీయ యువ ఫుట్‌బాల్ సెన్సేషన్స్‌కు ఎంపికైన 21 మందిలో పాతబస్తీకి చెందిన యాసర్ ఖాన్ ఉన్నారు.

## డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



**పేట్ బషీరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త**
ప్రత్యేక శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్‌తో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, పేట్ బషీరాబాద్ ఏసిపి ఆధ్వర్యంలో మంగళవారం టీఎన్ఆర్ మాల్, రాయ్ చాందిని మాల్‌లో పోలీసులు విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. ఈ మాల్ వద్ద ఉన్నటువంటి సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు సరిగ్గా నిర్వహించడంలో విఫలం అవడం జరిగింది. అక్కడ గల సెక్యూరిటీ సిబ్బందికి ఏసీపీ పేట్ బషీరాబాద్ తనిఖీలు నిర్వహించడంలో తగు సూచనలు చేయడం జరిగింది.

## చిక్కడపల్లిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



డ్రంక్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు

**చిక్కడపల్లి, నవంబర్ 4 ప్రభాతవార్త:**
చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఏడుకొండలు నేతృత్వంలో జరిగిన ఈ డ్రైవ్‌లో స్థానిక ట్రాఫిక్ సిబ్బంది పాల్గొని తనిఖీలు నిర్వహించి ఈ సందర్భంగా 31 మందిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న 37 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా అందులో 31 మందికి ఫైన్ విధించగా మరో ఆరుగురికి వోకొక్కరికి ఆరు రోజుల జైలు, జరిమానా విధిస్తు న్యాయమూర్తి తుది తీర్పునిచ్చారు. డ్రంకెన్ డ్రైవ్ లో దొరికిన 37 మందిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా అందులో 31 మందికి ఫైన్ మరియు ఆరుగురు కి ఒక్కోరికి 6 రోజుల జైలు , రూ.లక్ష 21 వేల 900 ఫైన్ విడిసిన్నడం జరిగిందని ఏడుకొండలు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారందరిని నాంపల్లి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి పై మేరకు తీర్పును ఇవ్వడం జరిగిందన్నారు. నగర సీపీ, జాయింట్ సీపీల ఆదేశాల మేరకు ఎప్పుడైనా ఎక్కడైన డ్రంకన్ డ్రైవ్ 24బై7లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చి కోర్టులో హాజరుపరుస్తామని హెచ్చరించారు.

### ఖానాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**నార్సింగి, నవంబర్ 4 ప్రభాతవార్త :** గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం ఖానాపూర్ గ్రామంలోని ఎస్‌పి లేబర్ క్యాంపు వద్ద గుర్తు తెలియని వ్యక్తి, కదులలేని స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు 100.కు ఫోన్ చేసి సమాచారం అందించారు. నార్సింగి పెట్రోలింగ్ పోలీసులు ఈశ్వర్, రాములు సంఘటనా స్థలానికి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని 108.సహాయంతో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొంత సమయానికి ఆయన మృతి చెందాడని వైద్యులు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. మృతుడు 25-30.సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉంటాడని, మద్యం మత్తులో అర్ధనగ్నంగా గ్రామంలో తిరిగాడని, రాళ్లపై పడి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడని పోలీసుల విచారణలో తేలింది. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, 174.సెక్షన్ కింద కేసును దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే నార్సింగి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు వివరించారు.

## డివైడర్‌ను ఢీకొన్న కారు

**-వృద్ధ దంపతులకు గాయాలు**



మారేడ్‌పల్లిలో డివైడర్‌కు ఢీ కొన్న కారు

**కంటోన్మెంట్,నవంబర్ 4 ప్రభాతవార్త:** ఓ కారు అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొన్న సంఘటన మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లో నివాసం ఉంటున్న మారుతీ, జయలక్ష్మి అనే వృద్ధ దంపతులు వైద్య పరీక్షలు నిమిత్తం మంగళవారం ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లేందుకు కారులో సికింద్రాబాద్ వైపు వెళ్తున్నారు. కారు నడుపుతున్న వృద్ధుడు మారుతీకి ఒక్కసారిగా చెక్కర వచ్చి కండ్లు తిరగడంతో బ్రేక్ వేయబోయి ఎక్స్‌లేటర్‌ను నొక్కడంతో కారు ఢివైడర్‌కు ఢీ కొట్టింది. దీంతో స్వల్పగాయాలతో వృద్ధ దంపతులు బయటపడ్డారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు డివైడర్‌కు ఢీ కొట్టిన కారును పక్కకుతోసి వారిని ఆసుపత్రికి తరలించారు.

## చిన్నారితో అసభ్య ప్రవర్తన డ్యాన్స్ మాస్టర్ అరెస్టు

**హైదరాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త:**
నగరంలోని బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది.ఓల్డ్ బోయిన్‌పల్లిలో సుబ్బు డాన్స్ స్టూడియో నిర్వాహకుడు జ్ఞానేశ్వర్ నాలుగేళ్ల చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. గత రెండు నెలలుగా తన వద్ద డ్యాన్స్ నేర్చుకునేందుకు వస్తున్న బాలిక పట్ల స్టూడియోలో ఎవరూ లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించాడు.ఈ నేపథ్యంలో కొన్నాళ్లుగా డ్యాన్స్ స్కూల్‌కు వెళ్లనని మారాం చేస్తుండటంతో.. చిన్నారిని తల్లిదండ్రులు ప్రశ్నించగా అసలు విషయం బయటకువచ్చింది. జ్ఞానేశ్వర్.. స్టూడియోలో చిన్నారిపై లైంగిక వేధింపులకు గురి చేయడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పడంతో వెంటనే బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపా రు. జ్ఞానేశ్వర్‌ను రిమాండ్‌కు తరలించడంతోపాటు స్టూడియో ను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లా డుతూ.. పాఠశాలలోనే చిన్నారులకు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలన్నారు.ఇలాంటి డ్యాన్స్ స్టూడియోలకు పంపే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

### ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి..

**పేట్ బషీరాబాద్, నవంబర్ 4, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని కొంపల్లి సినిప్లానెట్ సమీపంలో ఓ భవన కార్మికుడు విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన చెందిన బిక్కూర్ (28) బ్రతుకు దెవురుకు కోసం వచ్చి కొంపల్లిలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం 4గంటల సమయంలో సినిప్లానెట్ వెనుక భాగాన సెల్లార్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హిటాచి నడుపుతున్న డ్రైవర్ మధు ఆ కార్మికుడిని గమనించకుండా హిటాచితో నెట్టడం జరిగింది. అది బలంగా తగలడంతో బిక్కూర్‌కు తీవ్ర గాయాలు కాగ, చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. మార్గంమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి...

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 4, ప్రభాతవార్త**
కెపిహెచ్‌బిలో స్కూల్ బస్సు ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వసంత నగర్ కాలనీకి చెందిన వి కృష్ణారెడ్డి కుమారుడు వి.సతీష్ రెడ్డి (30) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తన టీఎస్ 07 ఎక్స్ 0490 స్కూటీపై వెళుతుండగా వెనుక నుండి వేగంగా వచ్చిన సిల్వర్ ఓక్స్ పాఠశాలకు చెందిన బస్సు నంబర్ టీఎస్ 15 యూసి 7367 బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో స్కూటీపై వెళ్తున్న సతీష్ రెడ్డి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంవల్లే ఘటన జరిగినట్లుగా ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. ఈ మేరకు కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కర్నూల్ బస్సు ప్రమాద క్షతగాత్రుడిని పరామర్శించిన కార్పొరేటర్



నవీన్ కుమార్‌ను పరామర్శిస్తున్న కార్పొరేటర్

**హయత్ నగర్, నవంబర్ 4 ప్రభాతవార్త:** ఇటీవల కర్నూల్ సమీపంలో బస్సు ప్రమాదంలో గాయపడిన హయత్ నగర్ ప్రాంతం(మన్సురాబాద్ డివిజన్ ) శ్రీ వెంకటేశ్వర కాలనీకి చెందిన అందోజు నవీన్ కుమార్ ను మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మంగళవారం పరామర్శించారు. నవీన్ కుమార్ బెంగళూరు వెళ్తుండగా కర్నూల్ వద్ద బస్సు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. మంటలు రావడం చూసి నవీన్ బస్సులో నుండి దూకడంతో కాళ్లకు ఫ్రాక్చర్ తో పాటు ఇతర గాయాలయ్యాయి.అతని యోగక్షేమలను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. తనను తాను కాపాడుకోవడంతో పాటు మరి కొంతమంది తోటి ప్రయాణికుల ప్రాణాలను సహసోపేతంగా కాపాడిన ఆయనను కార్పొరేటర్ ప్రత్యేకంగా అభినందించారు.

### నేడు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజాలు



మార్కెట్ లోని శ్రీ శ్రీ శ్రీ గరుడ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం దృశ్యం

**మలక్ పేట ,నవంబరు 4, ప్రభాతవార్త:** మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లోని శ్రీ శ్రీ శ్రీ గరుడ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం ఉదయం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజా కార్యక్రమాలు, హనుమాన్ చాలీసా పారాయణం, అన్న ప్రసాద వితరణ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు దేవాలయం కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సాయంత్రం దేవాలయంలో దీపార్చన తదితర పూజా కార్యక్రమా లను నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

### సిసి రోడ్డు పనులు పరిశీలించిన కార్పొరేటర్



**మల్కాజిగిరి నవంబర్ 4, ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ఇక్రిసెట్ కాలనీ లో 12 లక్షలతో కొనసాగుతున్న సి సి రోడ్డు పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, స్థానికులు వెంకటరత్నం, అనురాధ మైకెల్ కొండయ్య నారాయణ, రామకృష్ణ, ఓం ప్రకాష్, శైలజ, శశికళ, తదితరులు పాల్గొన్నారు

### కూడో మార్షల్ ఆర్ట్స్ పోటీలలో మూడు కాంస్య పథకాలను సాధించిన కృష్ణ లౌక్య




కృష్ణ లౌక్యకు పతకాలు , సర్టిఫికెట్లను అందజేసి అభినందనలు తెలియజేస్తున్న కోచ్ పవన్ కుమార్ శర్మ

**మలక్ పేట, నవంబర్ 4, ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో గుజరాత్ లోని సూరత్ లో ఇటీవల నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ అక్షయ్ కుమార్ 17వ కుడో టోర్నమెంట్ 2025లో హైదరాబాద్ నగరం మలక్ పేట నియోజకవర్గానికి చెందిన కృష్ణ లౌక్య ఉత్తమ ప్రతిభను కనబరిచారు. 10 సంవత్సరాల లోపు 30 కిలోల బాలికల విభాగంలో కృష్ణ లౌక్య పాల్గొని మూడు కాంస్య పతకాలను సాధించి తన సత్తాను చాటారు. మూడు కాంస్య పతకాలను సాధించిన కృష్ణ లౌక్యను కోచ్ పవన్ కుమార్ శర్మ, కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, క్రీడా సంస్థలు తదితరులు అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో జరగబోయే అంతర్జాతీయ టోర్నమెంట్ లో బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.

### బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం: ఆజం అలీ



ఆజం అలీని సన్మానిస్తున్న బాబు సుదర్శన్, కొరుడు భూమేష్, పగిళ్ల నర్సింగ్ తదితరులు

**మలక్ పేట, నవంబర్ 4, ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బిఆర్ఎస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆజం అలీ పేర్కొన్నారు. అజంపుర లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొరుదు భూమేష్, ఓల్డ్ మలక్ పేట హనుమాన్ దేవాలయం కమిటీ చైర్మన్ బాబు సుదర్శన్ లు నాయకులు కార్యకర్తలతో విచ్చేసి ఆజం ఆలీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు భూమేష్, బాబు సుదర్శన్ లు మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పగిళ్ల నర్సింగ్, నాగరాజు, చుక్క కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా నడిపిస్తున్న క్లీనిక్‌పై పోలీసులు దాడులు

### సీజ్ చేసిన పోలీసులు : నిర్వహకులపై కేసు నమోదు



పోలీసులు అదుపులోకి తీసుకున్న డా. చింతకింది బాలసిద్దులు

**ఉప్పల్, నవంబరు 4 ప్రభాతవార్త :** చిలుకానగర్ చౌరస్తాలో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రజలకు వైద్య చికిత్సలు చేస్తున్న ఒక ప్రైవేటు క్లినిక్‌పై మల్కాజిగిరి ఎస్ఓటి పోలీసులు దాడి చేసి ఆసుపత్రిని సీజ్ చేశారు. ఎస్ఐ వినయ్, ఎస్ఓటి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్ చౌరస్తాలో సింధూ పాలి క్లీనిక్ పేరుతో పార్మసిస్టు కిర్మణయి అనే మహిళ హోమియోపతి వైద్యుడు చింతకింది బాలసిద్దులు (41)తో గత కొద్ది రోజులుగా ప్రజలకు వైద్యం చేస్తున్నారని తెలిపారు. సరైన చెల్లుబాటు అయ్యే సర్టిఫికేట్లు లేకుండా వైద్యం చేస్తున్నారని, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ కూడా లేదని తెలిపారు. బోడుప్పల్ లక్ష్మినగర్‌లో ఉంటూ ప్రజలకు అల్లోపతి వైద్యుడిగా చలామణి అవుతూ వైద్యం చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. అతనిని పట్టుకుని ఆసుపత్రిని సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. క్లీనిక్‌కు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి లేదని, పార్మసిస్టు కిర్మణయిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు.

ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్ట్రామ్ వాటర్ పనులు త్వరగా మొదలుపెట్టాలి



ఉప కమిషనర్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, నవంబర్ 4 ప్రభాతవార్త:** చాలా కాలంగా పెండింగ్లో ఉన్న స్ట్రామ్‌వాటర్ పండ్లను త్వరగా మొదలు పెట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్, సరూర్నగర్ సర్కిల్ ఉపకమిషనర్ బువనగిరి శ్రీనివాసరావుని కలిసి పలు సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రిపురం నుండి ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ వరకు మంజూరి అయిన రూ.5కోట్ల స్ట్రామ్‌వాటర్ లైన్ పనులను త్వరగా మొదలు పెట్టాలన్నారు. భారీ వర్షాలకుగాను గాయత్రిపురం నుండి ఎస్‌ఆర్‌ఎల్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి, కమర్షియల్ టాక్స్ కాలనీ నుండి ఎస్బిహెచ్ కాలనీ (వెంకటేశ్వరస్వామి గుడిదగ్గర నుండి) మీదుగా మోహన్‌నగర్ చౌరస్తా వరకు మొత్తం రోడ్డు గుంతలు గుంతలుగా మారడంతో ప్రజలు నడవలేని స్థితిలో ఉన్నారని నూతన రోడ్డుకు వెంటనే నిధులు కేటాయించాలన్నారు. నిధులు కేటాయించడం ఆలస్యం అవుతున్నందువల్ల ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రజలకు ఏలాంటి అవాంతరాలు కలగకుండా ప్యాచ్‌వర్క్ పనులను వెంటనే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, డిసిపి సత్యభామ, డిఈ చందన, ప్రాజెక్ట్ ఆఫీసర్ విక్రాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# కుర్మల్‌గూడ డంపింగ్ యార్డు నుండి చెత్తను తరలించాలని వినతి



బడంగ్‌పేట్ కమీషనర్ సరస్వతికి వినతి పత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, స్వచ్ఛ ఆటో కార్మిక సంఘం నాయకులు

**సరూర్‌నగర్, నవంబర్ 4 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడలో ఏర్పాటై ఉన్న చెత్త డంపింగ్ పూర్తిగా చెత్తతో నిండిపోయిన నేపథ్యంలో అక్కడి నుండి చెత్తను తరలించాలని సిఐటియు నాయకులు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం పలువురు నాయకులు కమీషనర్‌ను సరస్వతిని కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుర్మల్‌గూడ చెత్త డంపింగ్ యార్డులో చెత్తను డంప్ చేయడానికి వీలు లేకుండా పూర్తిగా నిండి ఉందనీ దీంతో స్వచ్ఛ ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమీషనర్‌కు వివరించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు చెత్తను సేకరించి ఇక్కడ డంపింగ్ చేయడానికి వచ్చే కార్మికులకు చెత్తను ఎక్కడ వేయాలో అర్థం కాని పరిస్థితి ఉందని వారు తెలిపారు. ఏ రోజు కా రోజు చెత్తను తరలించకపోవడంతో సమస్య తీవ్రమవుతున్నదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛ ఆటోలకు ఇబ్బందులు లేకుండా చెత్తను డంపింగ్ యార్డు నుండి తొలగించి తరలించాలని వారు కోరారు. ఈ కర్యాక్రమంలో జిల్లా సిఐటియు ఉపాధ్యక్షుడు డి. కిషన్, నాయకులు దాసరి బాబు, శేఖర్ యాదవ్, శివ, స్వచ్ఛ ఆటో కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, సుధాకర్, నర్సింహ, బాలకృష్ణ, నాగేందర్, మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరద ముంపుకు శాశ్వత పరిష్కారం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, నవంబర్ 4 ప్రభాతవార్త:** న్యూగడ్డిన్నారం వరద ముంపు సమస్యకి సశ్వత పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. న్యూగడ్డిఅన్నారం కాలనీలో వరద ముంపు సమస్యకి శాశ్వత పరిష్కారం దిశగా రూ.93 లక్షల వ్యయంతో నిర్మించే వరద కాలువ నిర్మాణ పనులకు మంగళవారం కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా న్యూగడ్డిఅన్నారం కాలనీ వాసులు చిన్న వర్షానికి కూడా వరద సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడడం నష్టపోవడం జరిగిందన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గతంలో సుమారు కోటి రూపాయలతో వరద కాలువ నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేశామన్నారు. అందులో భాగంగానే మళ్లీ ఆ వరద కాలువ కంటిన్యూయేషన్ నాలా విస్తరణ పనులను సుమారు రూ.93 లక్షల వ్యయంతో ఎస్బీఆర్ టవర్స్ నుండి న్యూగడ్డిఅన్నారం వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు జరగబోయే పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ పనులు పూర్తవుతే న్యూగడ్డిఅన్నారం కాలనీవాసులకు వరద ముంపు సమస్య నుండి శాశ్వత పరిష్కారం దిరుకుతుందనే విశ్వాసం వ్యక్తం చేసారు. అదేవిధంగా పనులు వీలైనంత త్వరగా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పూర్తి చేయాలనీ అధికారులకు, గుత్తేదారుకు సూచించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రఘు, మాజీ అధ్యక్షులు యాదయ్య, నారాయణరావు, కాలనీ సెక్రటరీ బాలరాజు, రాము, రవిచారి, అనంత బాలాజీ, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, ఇతర కాలనీవాసులు పాల్గొన్నారు.

## అసైన్స్ భూముల యజమాన్య హక్కులు సాధించుకోవాలి : ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్



హబ్సిగూడలో జరిగిన తెలంగాణ భూరక్షణ సమితి సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం తదితరులు

**ఉప్పల్, నవంబరు 4 ప్రభాతవార్త :** తెలంగాణలో అసైన్డ్ భూముల యాజమాన్య హక్కుల సాధన కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హబ్సిగూడలోని ఒక హోటల్‌లో అసైన్డ్ భూముల యాజమాన్య హక్కుల సాధన కోసం అవగాహన, భవిష్యత్ కార్యచరణపై తెలంగాణ భూరక్షణ సమితి, మాదిగ హక్కుల దండోరా, ప్రజా సంఘల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సు సమన్వయకర్త కవ్వంపల్లి రవి మాదిగ, తెలంగాణ భూరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ తోపాటు, టిబిఆర్ఎస్ గౌరవ సలహాదారులు రాపోలు రాములు, తెలంగాణ భూరక్షణ సమితి వర్కింగ్ ప్రసిడెంట్ చింతకింది స్వామి, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తికుమార్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కన్వీనర్ నంద్రు నరసింహ, చిట్టిపాక ప్రభాకర్, పులిగిళ్ల బాలయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భూమి యజమాన్య హక్కుల సమస్య ఎప్పటి నుంచో ఉందని, పేదలకు భూమి దక్కినా దానిపై హక్కులు దక్కలేదన్నారు. ఉమ్మడి తెలంగాణ రాష్ట్రం నుంచి ఇప్పటి వరకు అనేక పథకాలు వచ్చాయని, ఇంకా లక్ష 60వేల భూములు మిగులు భూములుగా ఉన్నాయని తెలిపారు. దళితుల భూముల రక్షణకు ప్రత్యేక భూకమిషన్ వేయాలని, పంపిణీ చేసిన భూములపై లబ్ధిదారులకు యజమాన్య హక్కులు ఇవ్వాలని కోరారు. కోనేరు రంగారావు కమిటి సిఫారసును అమలు చేయాలని, ఎస్‌టి, ఆదివాసిలు సాగుచేసుకుంటున్న పోడు, లావణి భూములకు పట్టాలు ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎంస్ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ వెంకన్న, చింత స్వామి, కమ్మెట రామస్వామి, అనిల్‌కుమార్, రూత్,విజయకుమారి, సింగరయ్య, పరమేశ్వర్, మల్లేష్, ఆడివయ్య, దేవయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు అండగా షి టీం బృందాలు : సిపి సుధీర్ బాబు




**నేరేడ్ మెట్, నవంబర్ 4,ప్రభాతవార్త :** మహిళల భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని రాచకొండ మహిళా భద్రతా విభాగం, షీ టీమ్స్ బృందాలు రాచకొండ భద్రతా మండలితో కలిసి స్టే సేఫ్ కార్యక్రమం కింద సరూర్‌నగర్ పరిధిలోని పీజీ బాలికల హాస్టళ్లలో విస్తృత తనిఖీలు నిర్వహించా యి.పోలీసు కమిషనర్ జి. సుధీర్‌బాబు ఐపిఎస్ నాయకత్వం, మార్గద ర్శకత్వంలో ఈ ఆడిట్ కార్యక్రమం చేపట్టారు. మహిళలు సురక్షితమైన వాతావరణంలో నివసించేందుకు అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలను బృందాలు క్షుణ్ణంగా పరిశీలించాయి.తనిఖీల్లో ఆహార పరిశుభ్రత, శిక్షణ పొందిన వాచ్‌మెన్ నియామకం, అగ్నిమాపక భద్ర తా ప్రమాణాలు, సీసీటీవీ కెమెరాల పనితీరు, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటు వంటి అంశాలను విపులంగా పరిశీలించారు.మహిళల భద్రత పట్ల నిర్లక్ష్యం సహించబోదని, ప్రతి హాస్టల్ బాధ్యతగా భద్రతా ప్రమాణాలను పాటించాలన్నారు. ఈ చర్య ద్వారా మహిళలకు మ రింత భద్రమైన వాతావరణాన్ని సృష్టించాలనే రాచకొండ పోలీసు కట్టుబాటును షీటీమ్స్ మరోసారి ప్రతిబింబించిందని అధికారులు పేర్కొన్నారు.

### సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కిషన్, దాసరి బాబు, యాదగిరిచారి తదితరులు

**సరూర్‌నగర్, నవంబర్ 4 ప్రభాతవార్త:** ఈ నెల 10, 11 తేదీల్లో హైదరాబాద్ నగర శివార్లలోని రాజేంద్రనగర్ కాటేదాన్ పారిశ్రామి కవాడలో జరిగే సిఐటియు రంగా రెడ్డి జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ మంగళవారం బడంగ్‌పేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సమస్యలు, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సిఐటియు ఆధ్వర్యంలో కాటేదాన్ చౌర స్తాలోని స్వప్న థియేటర్ వద్ద తలపెట్టే ప్రతిష్టాత్మక మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యాదగిరిచారి, దాసరి బాబు, శేఖర్ యాదవ్, పాండు నాయక్, శివ, వెంకయ్య, మల్లికార్జున్, లక్ష్మారెడ్డి, తులసయ్య, సురేందర్, సంపత్‌రెడ్డి, చరణ్, లింగంగౌడ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక పౌర్ణమి వేడుకలకు సిద్ధమైన కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం



కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఈఓ. లావణ్య, ధర్మకర్తలు

**సైదాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త:** చారిత్రక నేపథ్యం కలిగిన శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం కార్తీక పౌర్ణమి వేడుకలకు ముస్తాబయింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం సుప్రభాతం, పుష్కరిణి పూజ, ధ్యానాంజనేయ స్వామి వారికి ప్రత్యేక సింధూర అభిషేకము, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ, అష్టోత్తరములు, అర్చనలు, ఆకు పూజలు, చండీ హోమం, సాయంత్రం ఆ కాశ దీపారాధన, రథోత్సవం, హారతి, తీర్థప్రసాద వితరణ ఉంటుంది. కార్తీక పౌర్ణమి రోజు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నారు. ఉదయం 6.30 వరకు సింధూర అభిషేకం చేయు భక్తులను మాత్రమే ఆలయంలోనికి అనుమతించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని దేవాలయంనకార్యనిర్వాహణాధికారి ఎన్.లావణ్య, చైర్మన్, ధర్మకర్తలు తెలిపారు.

## బీరప్పగడ్డలో సిసి రోడ్డు పనులు : బన్నాల గీత



బీరప్పగడ్డలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 4 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో సిసి రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ పరిధిలోని బీరప్ప గడ్డలో సుమారు రూ.23లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు : కార్పొరేటర్ బన్నాల పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యమకంలో డిఇ వెన్నెలగౌడ్, ఎఇ రాధిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కె.జగన్, స్థానికులు మార్కా శీను, గణేష్ ,ఇంద్రసేనారెడ్డి, సత్యనారాయణ,శ్యామ్ ,బంటి పాల్గొన్నారు.

## ఉప్పల్ శ్రీ మహంకాళి ఆలయం హుండీ లెక్కింపు



ఉప్పల్ శ్రీ మహంకాళి దేవాలయం హుండీ లెక్కింపులో పాల్గొన్న చైర్మన్ తెల్కల మోహన్‌రెడ్డి, ఈవో వీరేశం తదితరులు

**ఉప్పల్, నవంబరు 4 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ మహంకాళి ఆలయం హుండీని అధికారులు మంగళవారం లెక్కించారు. ఆలయ కమిటి చైర్మన్ తెల్కల మోహన్‌రెడ్డి, ఈవో వీరేశం పలువురు ఆలయ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఆలయం హుండీ లెక్కించారు. ఈసందర్భంగా సుమారు హుండీలో భక్తుల నుంచి 84వేల వచ్చినట్లు వారు తెలిపారు. ఆలయం అభివృద్ధికి భక్తులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు అలుగుల అనిల్, రాఘవేంద్ర, గుమిడెల్లి కృష్ణ, నేతలు బిక్కుమళ్ల అంజయ్యగుప్త, భాస్కర్, అన్నపు రెడ్డి కృష్ణారెడ్డి, నరేష్, శాగ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో ఘనంగా శివనామస్మరణ



ఉప్పల్ భగాయత్‌లో జరిగిన లక్ష దీపోత్సవంలో అనుగ్రహ బాషణం చేస్తున్న శ్రీ త్రిదండి దేవనాధ రామానుజ జీయర్ స్వామి దృశ్యం.

**ఉప్పల్, నవంబరు 4 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న లక్ష దీపోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల మధుసూదన్ రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపారాధనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాధ రామానుజ జీయర్ స్వామిచే అనుగ్రహ భాషణం, ప్రవచనా సూక్తులు వివరించారు. ఈ సందర్భంగా స్వామిజీ కార్తీక మాస దీపం యొక్క గొప్పతనం గురించి వివరించారు.అనంతరం రుద్రాభిషేకం, అర్చకులచే మహా మంగళ హారతులు వైభవంగా జరిగాయి. ఈ ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, పలువురు ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



జిల్లా డిప్యూటీ కలెక్టర్ విజేయందర్ రెడ్డికీ వినతి పత్రం

**నేరేడ్‌మెట్ నవంబర్ 4,ప్రభాతవార్త :** బహుజన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలనే డిమాండ్‌తో 42 రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.జస్టిస్ ఈశ్వరయ్య, ఐఏఎస్ చిరంజీవి, డాక్టర్ విశారదన్ మహరాజ్, బాలరాజ్ గౌడ్ పిలుపు మేరకు ఈ వినతిపత్రం సమర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి బహుజన కులాల చైతన్య వేదిక నాయకులు మాట్లాడుతూ, బహుజన సమాజానికి సరైన రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రాతినిధ్యం రావాలంటే రిజర్వేషన్ శాతం పెంపు తప్పనిసరి అని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో వంచిత వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు అవసరమని, 42 శాతం రిజర్వేషన్ అమలు ద్వారా మాత్రమే సమానతా సమాజం సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. ఈ డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వేదిక వర్కింగ్ అధ్యక్షుడు రమేష్ గౌడ్, నాయకులు ఒగ్గు చంద్రశేఖర్, కరణం గోపి, నవీన్ గౌడ్, బత్తి నరసింహ గౌడ్, సుందర్ యాదవ్, రెడ్డిపల్లి శ్రీనివాస్, ప్రకాష్, సంజయ్, జోగు శీను, తోట నగేష్, రాములు, నర్సింగరావు, రాజు గౌడ్, ఎస్.రమేష్, మధు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.వేదిక నాయకులు భవిష్యత్ లో ఈ ఉద్యమాన్ని మరింత విస్తరించి, ప్రజల్లో చైతన్యం పెంచే దిశగా పథకాలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

## కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు తథ్యం

**ఎల్.బి.నగర్, నవంబర్ 4 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు తథ్యమని టీపీసీసీ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేవ భాస్క ర్‌రెడ్డి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలిపే లక్ష్యంగా సోమాజి గూడ డివిజన్‌లోని పలు కాలనీల్లో భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగు తున్న అభివృద్ధి పనులే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయం చేయి పరుస్తుందన్నారు. ఎవరండీ కుట్రలు జరిపిన నవీన్‌యాదవ్ విజ యం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి, అల్లేకుమార్, నేనావత్ రాజునా యక్, నడికుడ శివకుమార్, మల్లేష్‌యాదవ్, ఎఎంసి డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ఏపురి నర్సింహ, రాణప్రతాప్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.